క్లుప్తంగా

దివ్యాంగులకు అవకాశాలివ్వాలి

కోవెలకుంట్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు కోరారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ వార్డు మెంబర్ స్థానం నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పురపాలక, నగరపాలక ఎన్నికల్లో దివ్యాంగులకు కోటా కేటాయించి రాజకీయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున అవకాశాలు కల్పించాలని కోరుతూ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ

కొలిమిగుండ్ల: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ఎంఈఓ-1గా రామకృష్ణయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజయ్య ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్యాపిలిలో ఎంఈఓగా పనిచేస్తున్న రామకృష్ణయ్యను కొలిమిగుండ్లకు నియమించారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటు విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఎంఈఓ-2 అబ్దుల్ కలాం, ఎమ్మార్సీ సిబ్బంది సహకారంతో ముందుకెళతామని పేర్కొన్నారు.

సర్వేకు సహకరించాలి


మాట్లాడుతున్న డాక్టర్ రమణయ్య

బనగానపల్లె రూరల్: పాడి రైతుల జీవన ప్రమాణాలపై జరుగుతున్న సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని పశు సంవర్ధకశాఖ ఆళ్లగడ్డ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య కోరారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం ఏడీఏ డాక్టర్ మారుతిసకారామ్ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. పాడి రైతుల్లో గొర్రెలు, మేకలు, కోళ్ల ద్వారా ఎంత ఆదాయం వస్తుంది. ఆయా కుటుంబాల వారు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారా, ప్రభుత్వ పరంగా పాడి రైతులకు ఏఏ పథకాలు వస్తున్నాయి. తదితర సమగ్ర వివరాలను పశువైద్య సిబ్బంది రైతుల వద్దకు వెళ్లి సేకరించాలన్నారు. సెప్టెంబరు 15 వరకు సర్వే జరుగుతుందని చెప్పారు. పశు వైద్యులు డాక్టర్ సునీల్, పారా సిబ్బంది, ఏహెచ్ఏలు, గోపాల మిత్ర తదితరులు పాల్గొన్నారు.

కొండముచ్చును బంధిస్తాం

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలో ప్రజలపై దాడి చేస్తున్న కొండముచ్చును పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్ఓ నాగమనేశ్వరి తెలిపారు. ఆమె మంగళవారం జలదుర్గం గ్రామంలో పర్యటించారు. కొండముచ్చు దాడిలో గాయపడిన బాధితులతో మాట్లాడారు. కొండముచ్చును బంధించేందుకు పలు చోట్ల బోన్లు, వలలు పెట్టినా పట్టుబడలేదన్నారు. బుధవారం రెస్క్యూ టీంను రప్పించి కొండముచ్చును పట్టుకుంటామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫారెస్టు రెంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, డీఆర్ఓ రవీంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలతో స్వాగతం

బేతంచెర్ల: మండలపరిధిలోని కొలుములపల్లె, బలపాలపల్లె, తవిసి కొండ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డిని చుట్టుముట్టారు. కొలుములపల్లె మసీదు లైన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీ మహిళలు కోరారు. ఎన్నికల ముందు తనను గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు పరిష్కరించకపోతే ఎలా అని మహిళలు ఎల్ల లక్ష్మి, ఈశ్వరమ్మ నిదీశారు. సంబంధిత అధికారులను పిలిపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తవిసి కొండ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు.పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విచారణ పేరుతో వేధింపులు

డోన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయడం మరిచి వైఎస్సార్‌సీపీ నేతలతో పాటు వారి కుటంబ సభ్యులను తప్పుడు కేసులతో వేధించడం మొదలుపెట్టింది. ఇందులో భాగంగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడైన ఓబుల్‌రెడ్డిని ఈ నెలలో రెండుసార్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు విచారించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కుటుంబ సభ్యులను దూషించారనే అభియోగంపై ఓబుల్‌రెడ్డిని తరచుగా విచారణకు పిలిపించుకొని పోలీసులు వేధిస్తున్నారని పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

డోన్ టౌన్: పోరాటాల పురిటి గడ్డ డోన్‌లో నంద్యాల జిల్లా సీపీఐ రెండవ మహా సభలు జరుగుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయులు అన్నారు. నేటి నుంచి పట్టణంలో రెండు రోజుల పాటు జరిగే జిల్లా మహాసభలపై వారు మంగళవారం స్థానిక నక్కి రామన్న భవన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. మహాసభల్లో భాగంగా బుధవారం కొత్త బస్టాండ్ నుంచి 50 మంది కోలాటం కళాకారులు, 300 మంది వలంటీర్లతో పాటు వేల సంఖ్యలో భారీ ర్యాలీ పాత బస్టాండ్ వరకు నిర్వహిస్తామన్నారు. గురువారం ప్రతినిధులతో సమావేశం, సీపీఐ భవిష్యత్ ప్రణాళికలు, నూతన కార్యవర్గం ఎంపిక ఉంటుందన్నారు. పార్టీ మహా సభలకు అగ్రిగోల్డ్ బాధితుల సంఘం వారు రూ.5 వేల విరాళం అందించారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

- 'మంచి ప్రభుత్వం'లో నాయకులు రాత్రిళ్లు పర్యటిస్తున్నారు
- వారు ఎక్కడికెళ్లినా నిలదీతలే!


తండా మహిళల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: కూటమి నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' అని గొప్పలు చెప్పుకుంటూ చివరకు ఎమ్మెల్యేలు, మంత్రులు గ్రామాల్లో ధైర్యంగా తిరగలేక రాత్రిళ్లు పర్యటిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ప్రజలు తిరగబడతారనే భయంతోనే వారికి ఈ దుస్థితి పట్టిందన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ఉమ్మాయిపల్లె తండా, ఉమ్మాయిపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత మొలక రాజారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 13 నెలల పాలనలో ప్రజలకు 13 లోకాలు చూపించిందని విమర్శించారు. కొత్తగా ఒక్క పింఛన్ మంజూరు చేయకపోయినా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. ఏ గ్రామంలో చూసినా బెల్ట్‌షాపులు, పేకాట క్లబ్‌లు, ఇసుక, మట్టి దోపిడీకి పాల్పడుతున్నారని టీడీపీ కార్యకర్తలు కమీషన్ల కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

హామీలపై ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే రెడ్‌బుక్ పేరుతో పోలీసులచే అక్రమ కేసులు నమోదు చేయడం, వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. 14 ఏళ్ల సీఎంగా అనుభవం ఉన్న చంద్రబాబు రూ.1.81 లక్షల కోట్ల అప్పు చేసి ఒక్క పథకం కూడా అమలు చేయలేకపోయారన్నారు. ఆ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు.

సూపర్ సిక్స్ ఏమైంది?

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు ఏ విధంగా మోసం చేశారో ప్రజలు ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ, ప్రస్తుత టీడీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. కూటమి పాలనలో తండాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. తండా వాసుల అభివృద్ధి కోసం కాటసాని గతంలో 325 మందికి రెండు ఎకరాల చొప్పున గతంలో భూపంపిణీ చేశారని, అలాగే తాగునీటి సమస్య లేకుండా చేశారని గుర్తు చేశారు. తాను జెడ్పీ నుంచి తండాలో సీసీ రోడ్లు వేయించామన్నారు. గతేడాది సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయిస్తే అధికారులను అడ్డుపెట్టుకొని పనులు చేయించకపోవడంతో నిధులు వెనక్కిపోయాయని వివరించారు. నాయకులు శ్రీనివాసులరెడ్డి, గంగభాస్కర్, సూర్యనారాయణ, లక్ష్మీనాయక్, వెంకటేష్ నాయక్, బీకూ నాయక్, అంబటి చంద్రమోహన్‌రెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, మూల ఈశ్వరరెడ్డి, పండ్ల కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వంలో అన్నీ కష్టాలే

జగన్ ఉన్నప్పుడే అంతా బాగుండేది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక అన్నీ కష్టాలే వచ్చి పడ్డాయని తండా మహిళలు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎందుకు తెచ్చుకున్నామా అని బాధపడుతున్నామని వాపోయారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 45 ఏళ్లు నిండిన మహిళలకు ఏడాదికి రూ.18,750 వచ్చేదని, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు ఉపయోగించుకునే వాళ్లమని చెప్పారు. చంద్రబాబు వచ్చాక ఒక్క రూపాయి కూడా ఆదాయం లేకుండా పోయిందన్నారు. కొండల్లోకి పోయి ఉపాధి పనులు చేస్తే నాలుగు నెలల కూలీ ఇంతవరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సాగుకు పెట్టుబడి సాయం లేదు.. గ్యాస్ డబ్బులు కొందరికే పడ్డాయని వాపోయారు.

రేపు ఆల్వకొండలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

సంజామల: కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియచేసేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఆల్వకొండ వైస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆనంద్ బాబు మంగళవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు చేపట్టే కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, వైస్సార్ సీపీ అభిమానులు, అనుబంధ విభాగాల కన్వీనర్‌లు, సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల: పట్టణంలోని వికాస్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇటీవల కోవెలకుంట్ల సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఇందులో క్రీడాకారులు షణ్ముక, సాయికుమార్ పతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, పీఈటీ సుధీర్ తదితరులు అభినందించారు.

రాయితీపై సోలార్ రూఫ్‌టాప్


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంగోపాల్‌రెడ్డి

కోవెలకుంట్ల: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులకు సోలార్ రూఫ్‌టాప్‌లపై రాయితీ అందించనున్నట్లు బనగానపల్లె నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, ఎస్సార్బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంగోపాల్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ పథకానికి సంబంధించి మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటి పైకప్పుపై 10 చ.మీ లేదా 100 చదరపు అడుగుల స్థలంలో 1 కేడబ్ల్యూపీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల వారు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్ కల్యాణి, తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, ట్రాన్స్‌కో ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈ అనంతరావు పాల్గొన్నారు.

అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు

సంజామల: ప్రభుత్వ అనుమతి లేని ఫర్టిలైజర్ ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ భూమ జ్యోతి హెచ్చరించారు. ఆమె మంగళవారం ఆకుమల్ల గ్రామంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఏఓ మాట్లడుతూ.. రెండు దుకాణాల్లో అనుమతులు లేని 9 రకాల బయో మందులను గుర్తించి, రూ.96 వేలు విలువగల మందుల విక్రయాలను నిలుపుదల చేశామన్నారు. వాటికి సంబంధించి వారం రోజుల్లోపు అనుమతి పత్రాలను చూపకపోతే బయో మందులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాణ్యమైన మందులు విక్రయించకపోతే ఎరువుల దుకాణదారులపై రైతులు ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమోహన్, వీఏఏ సుధీర్ ఉన్నారు.

క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

సంజామల: పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి భూమ జ్యోతి అన్నారు. మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లడుతూ.. వరి సాగుచేసిన రైతులు ఆగస్టు 15, మిగతా పంటలకు ఆగస్టు 31వ తేదీ లోపు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల: స్థానిక నాగులకట్ట సమీపంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు.. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి తండాకు చెందిన పవన్‌నాయక్ (35) పట్టణంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.భార్య పద్మావతి గర్భిణి కావడంతో ప్రసవం కోసం తల్లిదండ్రులు ఓర్వకల్లు మండలం తండాకు తీసుకెళ్లారు. ఇరవై రోజుల క్రితం ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో పవన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేపట్టారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

అవుకు: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని నంద్యాల జిల్లా ప్రకృతి వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నయ్య రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని అవుకు-2 రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించడం వలన భూమి సారవంతమవడమే కాకుండా, రైతులు అనారోగ్యాలకు గురికారని అన్నారు. ప్రస్తుతం రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వరిలో జింక్ లోపం, మినుము పంటలో యాజమాన్య పద్ధతులు, మొక్కజొన్న పంటలో మెలకువలను రైతులకు వివరించారు. యూరియా, డీఏపీ వాడకం తగ్గించి నానో యూరియా, నానో డీఏపీ వాడాలని సూచించారు. అలాగే పంటలు సాగుచేసిన రైతులు సమీప ఆర్‌ఎస్‌కేల్లో పంట నమోదు చేయించుకోవాలన్నారు. పెయ్య దూడల ఉత్పత్తి పథకం ద్వారా ఎద సూదులు అందుబాటులో ఉన్నాయని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని అవుకు పశువైద్యాధికారిణి భారతీ దేవి తెలిపారు. ప్రకృతి వనరుల కేంద్రం, అవుకు వ్యవసాయాధికారులు వెంకటేశ్వర రెడ్డి, కలిముస్సీసా, వీఏఏలు, రైతులు, పాడి రైతులు పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవానికి సిద్ధం


విద్యుద్దీపాల వెలుగులో లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కొలిమిగుండ్ల: శతాబ్దాల చరిత్ర కలిగిన కొలిమిగుండ్ల కొండపై కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం జరిగే కుంభాభిషేక మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని రామ్‌కో సిమెంట్ యాజమాన్యం రూ.7 కోట్లతో జీర్ణోద్ధరణ చేపట్టింది. తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితుల బృందం ఈ నెల 27 నుంచి నాలుగు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, తులాలగ్నమందు మహాకుంభాభిషేకం చేపట్టనున్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణం కనులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మహాకుంభాభిషేక మహోత్సవానికి రామ్‌కో చైర్మన్ వెంకటరామరాజు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దనరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు హాజరవుతున్నారు. గర్భగుడి, ప్రాకారం, గాలిగోపురానికి విద్యుద్దీపాల అలంకరణ చేయడంతో భక్తులను ఆకట్టుకుంటోంది. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి 6 వేలకు పైగానే భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.

బెదిరింపులకు పాల్పడితే జైలుకే..


చికెన్ వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్: చికెన్ ధరలు పెంచి విక్రయించాలని వ్యాపారస్తులను బెదిరిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీ షీట్లు తెరుస్తామని డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈనెల 26న పట్టణానికి చెందిన కొందరు హోల్‌సేల్ డీలర్లు చికెన్ దుకాణాల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతూ రేటు బోర్డులను తొలగించిన ఘటనపై మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద చికెన్ వ్యాపారస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఎవరి వ్యాపారాలు వారు చేసుకోవాలని, ఇతరుల వ్యాపార వ్యవహారాల జోలికి వెళ్లరాదన్నారు. ఎవరికి నచ్చిన రేటుకు వారు విక్రయించుకోవచ్చన్నారు. పట్టణంలోని చికెన్ వ్యాపారులు సిండికేట్ అయ్యి ప్రజలను దోచుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

రెండు రోజులు విద్యుత్ కోతలు

డోన్ టౌన్: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ వెంకటాపురం ఫీడర్ లైన్ కింద రూరల్ డెవలప్‌మెంట్ పనులు జరుగుతున్నందున బుధ, గురువారాల్లో వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల, అబ్బిరెడ్డిపల్లె గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయిత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి 10 గంటల వరకు, మళ్లీ సాయిత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: వెంగళాంపల్లి ఫీడర్ పరిధిలోని వెంగళాంపల్లి, వెంకటాంపల్లి, ఎన్ రంగాపురం గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైన తెలిపిన గ్రామాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. కొత్తగా 11 కేవీ ఫీడర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్యాపిలి: జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలని ఎస్ఐ మధుసూదన్ సూచించారు. ఆయన మంగళవారం పోతుదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెడు వ్యసనాలు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తోటి విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా, సోదరభావంతో మెలగాలన్నారు. ఈవ్ టీజింగ్ ద్వారా తోటి విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే ఉపాధ్యాయుల దృష్టికి, తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 100, 1930, 108 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. హెచ్‌ఎం అరుణ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కోవెలకుంట్ల: మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులపట్ల ఎవరైనా అసభ్యరకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా 112 నంబర్ కాల్ చేయడం లేదా శక్తి యాప్‌లో బటన్ నొక్కడం ద్వారా తక్షణ సాయం అందుతుందన్నారు. అలాగే సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, శక్తిటీం ఏఎస్ఐ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిసెప్షన్ ఏర్పాట్ల పరిశీలన


డోన్ పార్టీ నేతలతో చర్చిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

డోన్: స్థానిక దత్తాత్రేయ స్వామి ఆలయ సమీపంలోని 18 ఎకరాల సువిశాల మైదానంలో ఆగస్టు 6న తన కుమారుడు అర్జున్ అమర్నాథ్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌కు మాజీ ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఉదయం పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటుపై ఆరాతీశారు. మాజీ మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు పసాద్ తదితరులు ఉన్నారు.

పార్టీ శ్రేణులతో సమావేశం

బేతంచెర్ల: మండలంలో నెలకొన్న సమస్యలపై బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం పార్టీ నాయకులతో చర్చించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలి, ఖాజా హుసేన్, చంద్రారెడ్డి, మురళీ, రామచంద్రుడు, లక్ష్మిరెడ్డితో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్ రెడ్డి, జాకీర్ హుసేన్, సర్పంచ్‌లు తిమ్మయ్య, వెంకటేశ్వర్లు, రంగస్వామి, మురళీధర్‌రెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి, నాగ వెంకటేశ్వర్లు, చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, మధు, ఇబ్రహీం, పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి


విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ మండల అధ్యక్షుడు గున్నాల శేష జశ్వంత్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని వెలగటూరు రస్తా పక్కన ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని విద్యార్థి విభాగ కమిటీ సభ్యులు సందర్శించారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, తాగునీరు, వసతి గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని సిబ్బంది చెప్పారు. హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని వార్డెన్ వనజాక్షి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో ప్రైవేట్ భవనంలోకి హాస్టల్‌ను మార్పు చేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, యువజన, వాణిజ్య విభాగాల మండల అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగ కమిటీ సభ్యులు సమీర్, చరణ్, మహీదర్, ఓబులేసు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇస్తామన్న హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు విస్మరించి ప్రభుత్వ భూములను బడా కంపెనీలకు కారు చౌకగా విక్రయిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, డోన్ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు విమర్శించారు. ఇళ్లు లేని 250 మంది నిరుపేదలతో పట్టణంలో ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం డీటీ సునీల్‌రాజుకు వినతి పత్రం అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

బనగానపల్లె రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల దిశ మహిళా పోలీసు స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. మంగళవారం సాయంత్రం నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని కైప గ్రామంలో బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. సీఐ గౌతమి మాట్లాడుతూ.. చిన్న పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని, గుర్తు తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయరాదన్నారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- నిరసన గళం విప్పిన వార్డు కౌన్సిలర్లు, చైర్మన్
- గత సమావేశ తీర్మానాలపై నిలదీత


మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: ప్రజల సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలు నిర్వహించడం ఎందుకని వార్డు కౌన్సిలర్లు షేక్ ముబీనా, ఇబ్రహీం, శకుంతల, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి నిరసన గళం విప్పారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన, కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్లు తమ ఆవేదన వెలిబుచ్చారు. వార్డులోకి వెళ్లితే సమస్యలు పరిష్కరించడం లేదని ప్రజలు నిలదీస్తున్నారని కౌన్సిలర్లు వాపోయారు. చైర్మన్‌గా ఉన్న తన వార్డులో అభివృద్ధి పనులపై తనతో చర్చించకుండా అనధికార వ్యక్తులు చెప్పిన విధంగా పనులు చేయడం ఏమిటని చైర్మన్ ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేస్తే సమ్మతమే కాని కొందరి స్వార్థం కోసం చేసే పనుల వల్ల నష్టమే తప్ప లాభం లేదని అసహనం వ్యక్తం చేశారు. గత నెలలో జరిగిన సమావేశంలో.. బైటిపేట కాలనీ సత్రం 800 మీటర్ల రహదారిలో ఉన్న 8 స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని చెప్పి నెల రోజులు గడిచినా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. స్పీడు బ్రేకర్ల వల్ల వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బేతంచెర్లకు నీరు సరఫరా చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నీటి సమస్య తీర్చలేకపోవడం తగదని వార్డు కౌన్సిలర్లు, చైర్మన్ ఆవేదన వెలిబుచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని గత సమావేశంలో చెప్పినా నెరవేర్చలేదని, వీధి కుక్కల భారీ నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు రూ.20 లక్షలు ఖర్చు చేసినా సమస్య అలాగే ఉందని కౌన్సిలర్లు కోట్ల మధుసూదన్‌రావు, శకుంతల, షేక్ ముబీనా అన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. స్పీడ్ బ్రేకర్లను తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేస్తామని, వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ జరుగుతోందని కౌన్సిలర్లు తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని సమాధానం ఇచ్చారు.

టీడీపీ కౌన్సిలర్ల డుమ్మా

నగర పంచాయతీ సర్వసభ్య సమావేశానికి టీడీపీ వార్డు కౌన్సిలర్లు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. మొత్తం ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లు ఉండగా మంగళవారం జరిగిన సమావేశానికి ఒక్క రు కూడా హాజరు కాలేదు. రాజకీయ కారణాలో లేక సరైన గుర్తింపు దక్కడం లేదనే భావనతో సమా వేశానికి రావడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. మండల టీడీపీ నాయకులు ఆధిపత్య ధోరణితో తమకు నచ్చిన వారికి పనులు చేస్తూ వార్డు కౌన్సిలర్లుగా ఉన్న తమను చిన్నచూపు చూస్తున్నారని, దీనిపై మూకుమ్మడిగా నిరసన తెలుపుతూ సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది.